పత్రికాప్రకటన                                                    కాకినాడ, 22.9.2018

కౌశల్ గోదావరి ప్రోజెక్ట్ ద్వారా ఈ సంవత్సరం జిల్లాలో 22 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు.

శనివారం కాకినాడ రూరల్ నియోజక వర్గం పరిధి మాధవపట్నంలోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో కౌశల్ గోదావరి-వికాశ ప్రోజెక్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ముఖ్య అతిధిగాను, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యన్నారాయణ మూర్తి విశిష్ట అతిధిగాను హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ యువజన సంక్షేమం, సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కనుగుణంగా జిల్లాలో కౌశల్ గోదావరి ప్రోజెక్ట్ ద్వారా యువతకు వేతన ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 25 జాబ్ మేళాలు నిర్వహించి సుమారు 17 మంది యువతీ యువకులకు ఈ ప్రోజెక్ట్ ద్వారా నెల్లూరు శ్రీసిటీ, విశాఖపట్నంలలోని పారిశ్రామిక, ఐటి సంస్థలతో పాటు, మెడికల్, హాస్పిటల్స్, అర్చకత్వం తదితర ఉపాధి అవకాశాలున్న అన్ని రంగాలలోను ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఈ సంవత్సరం డిశంబరు నాటికి జిల్లాలో మరో 22 వేల మంది యువతకు ఉపాది కల్పనకు లక్ష్యం చేపట్టామని, అందులో భాగంగానే 3,500 మంది యువతకు అవకాశాల అందించేందుకు తొలి మెగా జాబ్‌మేళాను మాధవపట్నంలో నిర్వహిస్తున్నామన్నారు. మేళాకు హాజరైన యువతీ యువకులకు అభినందనలు తెలియజేస్తూ, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవలం జాబ్ మేళా నిర్వహించడమే కాకుకండా, ఎంపికైన వారందరు ఉద్యోగాలలో చేరడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ సేవలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాలు పొందిన వారందరూ వినయ, క్రమశిక్షణలతోను, నీతినిజాయితీలతోను ఉద్యోగాలలో రాణించాలని, నైపుణ్యాలు పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కౌశల్ గోదావరి ప్రోజెక్ట్ ద్వారా జాబ్ మేళాల నిర్వహణకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యన్నారాయణమూర్తి అందిస్తున్న సహాయసహకారాలకు జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యన్నారాయణ మూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి యువనేస్తం వంటి కార్యక్రమాలతో యువజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందన్నారు. జిల్లాలో యువతకు ఉపాధి కల్పనకు వినూత్నంగాను, విజయవంతంగాను అమలౌతున్న కౌశల్ గోదావరి ప్రోజెక్ట్ ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డును అందుకుని, జాతీయ స్థాయిలో ఆదర్శ ప్రోజెక్ట్ గా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాధవపట్నంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో టిసిఎల్, టెక్‌మహేంద్ర, జెన్‌పాక్, కాప్‌జెమిని, అపోలో, హెచ్‌సిఎల్ తదితర కంపెనీలు ఎంపికలో పాల్గొనడం ముదావహమని, అభ్యర్ధులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వికాస ప్రోజెక్ట్ డైరక్టర్ వి.ఎన్.రావు, చైతన్య ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)